నేడు కోటగిరి మండల సర్వసభ్య సమావేశం

కోటగిరి, మే 15 : కోటగిరి మండల ప్రజాపరిషత్ సమావేశపు హాలులో మండల సర్వసభ్య సమావేశాన్ని నేడు (గురువారం) నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మనోహర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు వల్లెపల్లి సునీతాశ్రీనివాస్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, వివిధ శాఖల అధికారులు పూర్తి నివేదికతో సమావేశానికి హాజరు కావాలని పేర్కొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రుద్రూర్, మే 15 : మండలంలోని మోడల్‌స్కూల్‌లో ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నరేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల వెలువడిన ఎస్సెస్సీ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ నెల 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీసీ-40, బైపీసీ-40, ఎంఈసీ-40, సీఈసీ-40 చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నట్లు వివరించారు.

రిటైర్డ్ అయిన వారి స్థానాల్లో పోస్టులను భర్తీ చేయాలి

ఖలీల్‌వాడి, మే 15 : రాష్ట్రంలోని ప్రభుత్వ వివిధ శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగులుగా ఉండి రిటైర్మెంట్ అయిన వారి స్థానాలను భర్తీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ కోరారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. రిటైర్డ్ అయిన తర్వాత కూడా ప్రస్తుతం వివిధ శాఖల్లో పనిచేస్తున్న సుమారు 1000 మంది విశ్రాంత ఉద్యోగుల స్థానంలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న వారితో పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా నాయకులు ఓమయ్య, రాజన్న, రఘురాం, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డిచ్‌పల్లి, మే 15 : మండల కేంద్రంతోపాటు దూస్‌గాం, మిట్టాపల్లి, కమలాపూర్, రాంపూర్ గ్రామాల్లో నేడు (గురువారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీ శ్రీనివాస్, ఏఈ సాయిలు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పలు గ్రామాల్లో భారీ వర్షం

చీమన్‌పల్లిలో కురుస్తున్న వర్షం

సిరికొండ, మే 15 : ఇన్ని రోజులు తన ప్రతాపాన్ని చూపిన భానుడు కాస్త శాంతించాడు. మండలంలోని చీమన్‌పల్లి, తాటిపల్లి, పందిమడుగు గ్రామాల్లో బుధవారం సాయత్రం ఉరుములు, మెరుపులతో కూడిన జోరు వాన కురిసింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఇన్నిరోజులు ఉక్కపోతతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలకు వర్షాలతో కాస్త ఉపశమనం లభించింది.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఇందల్వాయి, మే 15 : ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మండల ఆరోగ్య విస్తరణ అధికారి శంకర్ సూచించారు. మండలంలోని ఎల్లారెడ్డిపల్లి, అన్సాన్‌పల్లి గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించి, తడి, పొడి చెత్త, కంపోస్ట్‌షెడ్లను పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిశుభ్రతపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

మండల సమావేశంలో 20 అంశాలపై చర్చ

మాట్లాడుతున్న ఎంపీపీ పస్క నర్సయ్య

ఆర్మూర్‌టౌన్, మే15: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పస్క నర్సయ్య అధ్యక్షతన నిర్వహించారు. 20 అంశాలపై చర్చించామని, తీర్మానాలు చేయలేదని ఎంపీపీ తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ గజానన్, ఎంపీడీవో సాయిరాం, జడ్పీటీసీ సంతోష్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అక్రమంగా వెలసిన కోకా పరిశీలన

కోకాను పరిశీలిస్తున్న అధికారులు

నవీపేట, మే 15: మండలంలోని జన్నేపల్లి మాటు కాల్వపై ఇరిగేషన్ స్థలంలో అక్రమంగా వేసిన కోకాను పోలీస్ బందోబస్తుతో తొలగిస్తామని ఇరిగేషన్ ఈఈ హైమద్ జానీ పేర్కొన్నారు. జన్నేపల్లి మాటుకాల్వపై రెండు రోజుల క్రితం అక్రమంగా వేసిన కోకాను బుధవారం వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈఈ మాట్లాడుతూ గ్రామానికి చెందిన నగేశ్ అనే వ్యక్తి మాటు కాల్వను అనుకోని కోకా వేయడంతో గ్రామస్తులకు ఇబ్బందులు కలిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు. కోకా వేసిన నగేశ్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. తన కోకాతోపాటు మాటు కాల్వపై వెలసిన అక్రమ నిర్మాణాలను పూర్తి తొలగించాలని అధికారులను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ బాల్‌రాం, ఏఈ శ్రీధర్, ఎస్సై యాదగిరిగౌడ్, జన్నేపల్లి జీపీ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్‌రావు, కార్యదర్శి కవిత తదితరులు ఉన్నారు.

PUBLIC NOTICE

General Public/Banks/Financial Institutions, are hereby informed that my client **Sri. Adelli Ram Mohan S/o Adelli Rajanna**, R/o. Flat No.506, Sri Sai Nilayam, Vinayak Nagar, Nizamabad , has entered into an Agreement of Sale for purchase of below mentioned Schedule Property, from its lawful owner/s **Smt. Kuchana Laxmi Prasanna,** who acquired through Regd.Gift (Settlement) Deed No.4531/2018, JSRO,Nizamabad, for a valid sale consideration, subsequently my client paid part payment towards sale consideration to his vendor herein.

Therefore, call upon general Public/Banks/financial institutions in particulars are hereby having any objections or any charge or claim over the said property, they may approach with relevant evidence /documents to the undersigned within **7 days** of this publication, failing which my client will proceed with sale transaction and conclude the same by paying total amount and get it registration in favour of my client. Further if any objections received / raised will not be entertained.

SCHEDULE PROPERTY

All That the Existing RCC Roofed Residential House with Open Place bearing H. No.84/MIG-II, Mpl.Nos.1-1-1/184 (New), 1-1-1/281 (old), Ext. 233.33 Sq.yds or 195.09 Sq.mts, Situated at Vinayaknagar Phase-II, Nizamabad, within Municipal limits of Nizamabad.

AS BOUNDED BY: North: H.No.85/MIG-II, South : H.No.83/ MIG-II, East : 33'.0" Wide Road & West : H.No.103/MIG-II

Sd/- E.JAYASIMHA, Advocate
Nizamabad.Cell:94902 42033.

సమస్యలు విన్నవించినా పరిష్కరించరా?

నిజామాబాద్ సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో మధురిమ

సారంగాపూర్, మే 15 : గ్రామప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎన్నోసార్లు సభ దృష్టికి తీసుకువచ్చినా, వాటిని పరిష్కరించడంలో ఎందుకు అశ్రద్ధచేస్తున్నారని మండల కో-ఆప్షన్ సభ్యుడు ఆజాంతో పాటు పలువురు ఎంపీటీసీలు ప్రశ్నించారు. ఎంపీపీ బానోత్ అనూష ప్రేమ్‌దాస్ అధ్యక్షతన నిజామాబాద్ రూరల్ మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లేదా తహసీల్, ఎంపీడీవో కార్యాలయాల్లో పంపిణీ చేయకుండా స్థానిక ఎమ్మెల్యే ఇంటి వద్ద పంపిణీ చేయడం సరికాదని, ఇక ముందు ఇలా జరగకుండా చూడాలని సభ్యులు అధికారులను కోరారు. తమను సంప్రదించకుండానే సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్నారని అన్నారు. తిర్మన్‌పల్లిలో 45 మంది నిరుపేదలకు బయోమెట్రిక్‌లో వేలిముద్రలు రానందున వారికి రేషన్ బియ్యం ఇవ్వడం లేదని, పెన్షన్ డబ్బులు కూడా సమయానికి ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని కోరారు. గుండారంలో మిషన్ భగీరథ తాగునీరు సరిపడా అందక ఇబ్బందులు పడుతున్నారని, చేతిపంపులకు వెంటనే మరమ్మతులు చేయించాలని ఎంపీటీసీ అంకల గంగాధర్ తెలిపారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు బొల్లెంక సుమలతా గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, ఎంపీడీవో మధురిమ, సూపరింటెండెంట్ ప్రవీణ్‌రెడ్డి, అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ లీకేజీలను సరిచేయండి

డిచ్‌పల్లి, మే 15 : గ్రామాల్లో మిషన్‌భగీరథ పైపు లీకేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రజలకు తాగునీరందించాలని ఎంపీటీసీ సభ్యులు డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీపీ నర్సయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. సభలో అమృతాపూర్, సాంపల్లి ఎంపీటీసీలు ఒడ్డె సాయిలు, బిక్యానాయక్ మాట్లాడుతూ.. గ్రామాల్లో మిషన్ భగీరథ లీకేజీలు ఎక్కువగా ఉన్నాయని, దీంతో తాగునీరు

సర్వసభ్య సమావేశంలో అధికారులపై సభ్యుల ఆగ్రహం

సరిగ్గా అందడం లేదని అన్నారు. అమృతాపూర్‌లో ట్యాంకులకు కనెక్షన్ ఇచ్చినా, నల్లాల ద్వారా నీరు రావడం లేదని సభ దృష్టికి తెచ్చారు. ప్రతిసారి అనేక సమస్యలు సభ దృష్టికి తీసుకువచ్చినప్పటికీ ఏ ఒక్క సమస్యా పరిష్కారం కాలేదని అన్నారు. వానకాలం సీజన్ ప్రారంభమైనా జీలుగ విత్తనాలు అందుబాటులో లేవని, అందుబాటులో ఉంచాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించడం లేదని సభ్యులు సభ దృష్టికి తీసుకురాగా.. పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నామని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బదులిచ్చారు. ఎంపీడీవో రవీందర్ కల్పించుకొని.. తాను ఏ గ్రామానికి వెళ్లినా అంగన్‌వాడీకేంద్రాలను తరచూ తనిఖీ చేస్తున్నామని, పిల్లలకు నాణ్యమైన పుడ్ అందడం లేదని తెలిపారు. సర్వసభ్య సమావేశాలకు హాజరుకాని మండల, డివిజన్ స్థాయి అధికారులపై కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని ఎంపీడీవో తెలిపారు. సమావేశంలో జడ్పీటీసీ దాసరి ఇందిరాలక్ష్మీనర్సయ్య, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో శ్రీనివాస్, ఎంఈవో రాజగంగారాం, గురుకుల విద్యాలయ జిల్లా కో-ఆర్డినేటర్ సంగీత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా.. వీధి వ్యాపారుల వర్తక సముదాయం

వీధి వ్యాపారుల వర్తక సముదాయం

వీధి పాలు అవుతున్నది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నగరంలోని నాందేవ్‌వాడలో వీధి వ్యాపారుల కోసం మున్సిపల్ ఆధ్వర్యంలో వర్తక సముదాయాన్ని నిర్మించారు. దీనిని ఎవరికీ కేటాయించకపోవడంతో ప్రస్తుతం యాచకులు, మందుబాబులకు అడ్డాగా మారింది. మద్యంసీసాలు, చెత్తాచెదారంతో ఈ కేంద్రం నిండిపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా గుర్తించి, వ్యాపారులకు కేటాయించాలని కోరుతున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

తహసీల్దార్‌పై దళిత సంఘ నాయకుల ఆగ్రహం

తహసీల్దార్‌తో మాట్లాడుతున్న దళిత సంఘం నాయకులు

రుద్రూర్, మే 15 : రుద్రూర్ తహసీల్దార్ వెంకటేశంపై దళిత సంఘం నాయకులు బుధవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలకేంద్రంలోని సమీకృత భవనంలో తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగారు. కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ అఫిడవిట్ తప్పకుండా తీసుకురావాలని తహసీల్దార్ కావాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ కేటగిరీకి చెందిన వారు కాదన్న సందేహం ఉంటే గ్రామంలో ఎంక్వైరీ చేయాలని, అంతేగానీ ఇబ్బందులకు గురిచేయవద్దని కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. దళిత సంఘం తరపున పత్రం తీసుకువస్తే సర్టిఫికెట్లు త్వరగా అందజేస్తామని తహసీల్దార్ చెప్పడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాయిలు, దళిత సంఘం నాయకులు బందెల సంజీవ్, తెగుళ్ల వరప్రసాద్, నగేశ్, నవీన్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

19న పద్మశాలీ ప్రతిభా పురస్కారాలు

ఖలీల్‌వాడి, మే 15 : ఈనెల 19న పద్మశాలీ ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్లు కొండ లక్ష్మణ్ బాపూజీ పద్మశాలీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పెంట దత్తాద్రి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాకేంద్రంలోని బస్వా గార్డెన్‌లో సాయంత్రం 5.30 గంటలకు పురస్కారాలను అందజేయనున్నట్లు చెప్పారు. 2023-24 విద్యాసంవత్సరంలో పది, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన వారికి మొదటి, రెండవ, మూడవ బహుమతులు అందజేస్తామని, విద్యార్థులు కుల ధ్రువీకరణ, పది, ఇంటర్ మార్కుల జిరాక్స్‌లను కమిటీ సభ్యులకు అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9848480474, 9849845518 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. సమావేశంలో బూస రవి, సురేందర్, రాజేందర్, సత్యపాల్, శ్రీనివాస్, గంగధర్, రాజు పాల్గొన్నారు.

మహేంద్ర ఎక్స్‌యూవీ 3ఎక్స్‌వో కారు ఆవిష్కరణ

కారును ఆవిష్కరిస్తున్న ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ అరవింద్‌కుమార్ రవి

ఖలీల్‌వాడి, మే 15 : జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో ఉన్న మహీంద్రా షోరూంలో మహేంద్ర ఎక్స్‌యూబీ 3 ఎక్స్‌వో కారును ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ అరవింద్‌కుమార్ రవి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షోరూం ప్రతినిధులు మాట్లాడుతూ.. కారును నూతన టెక్నాలజీతో మార్కెట్లోకి తీసుకువచ్చారని, జిల్లాలో ప్రారంభంలోనే 151 కార్లు, దేశవ్యాప్తంగా గంటలోనే 50 వేల కార్లు బుకింగ్ అయ్యాయని తెలిపారు. కారు ప్రారంభ ధర రూ.7.49 లక్షల నుంచి రూ.15.49 లక్షల వరకు ఉందని తెలిపారు. లీటర్ పెట్రోల్‌కు 21.1 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సీవోవో డొక్కా సాయినాథ్, సేల్స్ మేనేజర్ మల్లికార్జున్, సుధాకర్, డీఈఎం మధుకర్ పాల్గొన్నారు.

గుండెపోటుతో ధర్పల్లి మండల వ్యవసాయాధికారి మృతి

- కన్నీటి వీడ్కోలు పలికిన మండల యంత్రాంగం

ప్రవీణ్ (ఫైల్)

ధర్పల్లి, మే 15 : మండల వ్యవసాయాధికారిగా 12 ఏండ్ల పాటు సేవలందించి అందరి మన్ననలు పొందిన మండల వ్యవసాయాధికారి ప్రవీణ్(41) బుధవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందాడు. భీమ్‌గల్ మండలం చేంగల్ గ్రామంలోని తన నివాసంలో గుండెపోటు రావడంతో కుటుంబీకులు హుటాహుటిన దవాఖానకు తరలించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. విషయం తెలుసుకున్న ఎంపీడీవో బాలకృష్ణ, తహసీల్దార్ మాలతి, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎంపీపీ నల్ల సారికా హన్మంత్‌రెడ్డి, ఏఈవోలు, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు, మండల కన్వీనర్ పీసు రాజ్‌పాల్‌రెడ్డి ప్రవీణ్ మృతికి సంతాపం ప్రకటించారు. చేంగల్ గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

'అల్లకొండ చరిత్ర గొప్పది'

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి అశోక్

ఆర్మూర్‌టౌన్, మే15: అల్లకొండ (బాల్కొండ) చరిత్ర ఎంతో గొప్పదని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి అశోక్ అన్నారు. బుధవారం పట్టణంలో అల్లకొండ ఉద్భవం-ఐదు ఆలయాలకు ప్రసిద్ధి అనే గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ మాట్లాడుతూ తన గురువు నర్సింగ్ రావు ఈపుస్తకాన్ని రచించారని అన్నారు. చరిత్రను భావితరాలకు అందించిన తన గురువుకు అభినందినలు తెలిపారు.

నేల చల్లబడ్డాక సాగు చేయండి

- రైతు అవగాహన సదస్సులో ఏడీఆర్ మల్లారెడ్డి

మాట్లాడుతున్న ఏడీఆర్ మల్లారెడ్డి

వ్యవసాయ యూనివర్సిటీ, మే 15: రెండు మూడు వర్షాలు పడి నేల చల్లబడ్డాక సాగుకు ఉపక్రమించాలని, తొలకరి చినుకులకే విత్తనాలు నాటి నష్టపోవద్దని పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఉపసంచాలకుడు (ఏడీఆర్) డాక్టర్ మల్లారెడ్డి రైతులకు సూచించారు. రైతులు తమకు సమీపంలో ఉన్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సలహా తీసుకొని సాగుకు ఉపక్రమించాలని చెప్పారు. సమతుల్య వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించేందుకు బుధవారం వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విలువైన సూచనలు చేశారు. ఈ ఏడాది వానకాలంలో మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సమతుల్య సాగు అవసరమని తెలిపారు. నీటి సాంకేతికతకు అనుగుణంగా ఎరువులు, విత్తనాలు తీసుకోవాలని చెప్పారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను కొనుక్కునేటప్పుడు అధికారులతో సంప్రదించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విత్తనాలను అర్హత గల డీలర్ వద్ద కొనుగోలు చేయాలని చెప్పారు. తప్పని సరిగా రసీదు పొంది పంట చివరి వరకు భద్రంగా దాచుకోవాలని సూచించారు. ఎప్పుడూ ఒకేరకమైన మూస పద్ధతిన పంటలు సాగు చేస్తే అపార నష్టాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. సమావేశంలో ఉద్యాన శాఖ అధికారులు ప్రేమ్ సింగ్, శేఖర్ పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. అంతకు ముందు నీటి సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం సంచాలకుడు డాక్టర్ అనిల్ కుమార్ పాల్గొని మాట్లాడారు. ఉద్యాన పంటలు కూరగాయలు, పూలతోటల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకుల వివరించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున రైతులు సదస్సుకు హాజరయ్యారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

రెంజల్, మే 15: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జీపీ కార్యదర్శులతో ఎంపీడీవో శ్రీనివాస్ సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో శానిటేషన్, తాగునీటి సమస్య తలెత్తకుండా సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్నులను వసూలు చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీవో గౌసొద్దీన్ పాల్గొన్నారు.

బోధన్ సెగ్మెంట్‌లో 74.56 శాతం పోలింగ్

- పోలింగ్‌లో ఉత్సాహంగా ఓటేసిన మహిళలు
- నర్సాపూర్‌లో అత్యధిక శాతం పోలింగ్ నమోదు
- అత్యధిక విద్యావంతులున్న బోధన్ పట్టణంలో అత్యల్పంగా నమోదు



బోధన్ మండలం బెల్లాల్ గ్రామంలో పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

బోధన్, మే 15: ఈనెల 13న నిర్వహించిన లోక్‌సభ ఎన్నికల్లో బోధన్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో పురుషుల కన్నా మహిళలు ఉత్సాహంగా ఓటు వేశారు. నియోజకవర్గంలో 2,23,096 మంది ఓటర్లు ఉండగా 1,66,330 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 246 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 74.56 శాతం పోలింగ్ నమోదైంది. పోలైన ఓట్లలో పురుషులు 78,836 మంది, మహిళలు 87,495 మంది ఉన్నారు.

రెంజల్ మండలంలో అత్యధికం.. బోధన్ పట్టణంలో అత్యల్పం..

రెంజల్ మండలంలో 81.60 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ మండలంలో మొత్తం 29,358 మంది ఓటర్లు ఉండగా, వారిలో 23,958 మంది ఓటు వేశారు. బోధన్ పట్టణంలో సెగ్మెంట్‌లోనే అత్యల్పంగా 66.67 శాతం పోలింగ్ నమోదైంది. పట్టణంలో మొత్తం 68,236 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 45,498 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. బోధన్ రూరల్ మండలంలో 30,719 ఓటర్లు ఉండగా 24,681 మంది ఓటు వేశారు. 80.34 శాతం పోలింగ్ నమోదైంది. సాలూర మండలంలో 17,416 మంది ఓటర్లు ఉండగా, 13,746 మంది ఓటు వేశారు. 78.92 శాతం పోలింగ్ నమోదైంది. ఎడపల్లి మండలంలో 31,175 మంది ఓటర్లు ఉండగా 24,342 మంది ఓటు వేశారు. 78.08 శాతం పోలింగ్ నమోదైంది. నవీపేట్ మండలంలో 46,192 మంది ఓటర్లు ఉండగా 34,105 మంది ఓటుహక్కు వేశారు. 73.83 శాతం పోలింగ్ నమోదైంది.

నర్సాపూర్‌లో అత్యధికం..

బోధన్ అసెంబ్లీ సెగ్మెంట్‌లోని 246 పోలింగ్ కేంద్రాల్లో బోధన్ పట్టణంలోని నర్సాపూర్‌లో అత్యధిక పోలింగ్ నమోదైంది. ఇక్కడి 28వ పోలింగ్ స్టేషన్‌లో 88.77 శాతం ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ మొత్తం 570 మంది ఓటర్లు ఉండగా, వారిలో 506 మంది ఓటు వేశారు. ఇది బోధన్ మున్సిపాలిటీలో కలిసిన విలీన గ్రామం కావటం గమనార్హం. నవీపేట్ మండలంలోని ఫతేనగర్ గ్రామం అధికంగా పోలింగ్ జరిగిన గ్రామాల్లో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఇక్కడ 181వ నంబర్ పోలింగ్ స్టేషన్‌లో మొత్తం 849 ఓటర్లు ఉండగా, అందులో 753 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ పోలింగ్ స్టేషన్‌లో 88.69 శాతం పోలింగ్ నమోతైంది. రెంజల్ మండంలోని కళ్యాపూర్ గ్రామంలోని 152 నంబర్ పోలింగ్ స్టేషన్‌లో అధికంగా పోలింగ్ నమోదులో మూడో స్థానంలో నిలిచింది. ఈ పోలింగ్ స్టేషన్‌లో 722 మంది ఓటర్లు ఉండగా, 640 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 88.64శాతం పోలింగ్ నమోదైంది.

పట్టణంలో పోలింగ్ స్టేషన్‌లో అత్యల్పంగా..

బోధన్ నడి బొడ్డున ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన 65వ నంబర్ పోలింగ్ స్టేషన్‌లో బోధన్ సెగ్మెంట్‌లోనే అత్యల్పంగా పోలింగ్ నమోదైంది. ఇక్కడ 49.79 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. అంబేద్కర్ చౌరస్తా, గంజ్ రోడ్డు కమాన్, ఎల్‌బీఎస్ నగర్ ప్రాంతాల్లో విద్యావంతులు, ఉద్యోగులు, వ్యాపారులు ఓటర్లుగా ఉన్నప్పటికీ ఇంత తక్కువగా పోలింగ్ నమోదవడం ఆశ్చర్యకరం.

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు

బోధన్ రూరల్, మే15: మండలంలోని అన్ని గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని ఏపీవో హేమలత తెలిపారు. పంట కాల్వ, పొలాలకు వెళ్లే రోడ్ల మరమ్మతు పనులు, చెరువులో పూడిక తీత పనులు చేస్తున్నట్లు చెప్పారు. పనులు కావాల్సిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

ఊటీపల్లి చెరువులో పూడికతీస్తున్న కూలీలు

హనుమాన్ కోడెలకు అంత్యక్రియలు

రెంజల్, మే 15: కందకుర్తిలో ఇటీవల వీధి కుక్కల దాడిలో గాయాలపాలైన హనుమాన్ మందిరం కోడెలు మృతి చెందగా బుధవారం గ్రామానికి చెందిన యువకులు అంత్యక్రియలు నిర్వహించారు. సంప్రదాయ బద్ధంగా హనుమంతు రావుకు చెందిన పంట పొలంలో కననం చేశారు.

అన్ని వైద్య సేవలు అందించాలి

శక్కర్‌నగర్, మే 15: బోధన్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ దవాఖానలో వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని ఆప్ పార్టీ బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి జునేద్ అహ్మద్ ఆరోపించారు. బుధవారం దవాఖానలో ప్రసవానికి వచ్చిన ఓ మహిళకు ఇక్కడ వైద్యులు లేరని, మూడో కాన్పు కావడంతో రిస్క్ ఉందని, ఆమెను నిజామాబాద్‌కు వెళ్లాలంటూ సిబ్బంది ఇబ్బందులకు గురిచేశారని ఆయన ఆరోపించారు. డ్యూటీ డాక్టర్లు సయితం సమయపాలన పాటించడం లేదని, దవాఖాన నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని ఆయన అన్నారు. దవాఖానలో మెరుగైన వైద్య సేవలు అందేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

కబడ్డీ సంఘం జిల్లా జనరల్ సెక్రటరీకి సన్మానం

కార్యదర్శిని సన్మానిస్తున్న ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయులు

ముప్కాల్, మే 15: నూతనంగా ఎన్నికైన కబడ్డీ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ కె.గంగాధర్, జాయింట్ సెక్రెటరీ జె.రాజ్‌కుమార్‌రెడ్డిని ఆసంఘం జిల్లా అధ్యక్షుడు లింగయ్య ఆధ్వర్యంలో బాల్కొండ ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయులు బుధవారం ముప్కాల్ మండల కేంద్రంలో సన్మానించారు. కార్యక్రమంలో ఉమ్మడి బాల్కొండ వ్యాయామ ఉపాధ్యాయులు గణేశ్, ఆవాల శ్రీకాంత్, కంచు మధు, స్రవంతి, సౌజన్య, కవిత, భార్గవి సాయి